Nava Telangana Dt - 04/05/16



# ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద రీడిజైన్

**ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద మార్పులు • మెట్రో పనుల తనిఖీలలో ఎండీ ఆదేశాలు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను నిర్మించేందుకు రీడిజైన్ చేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముందుగా నిర్ణయించిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీవరేజ్ లైన్ ఉండడంతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో మెట్రో కారిడార్-1లోని మలక్‌పేట, ఓఎంసీ, నాంపల్లి, లక్డీకపూల్, ఖైరతాబాద్ సాగుతున్న మెట్రో పనులను హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ట్రాఫిక్ అదనపు కమిషనర్ ఎం.జీతేంద్రతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మలక్‌పేట ఆర్‌ఓబీ పనులను పరిశీలించిన ఎండీ వయాడక్ట్ స్పాన్స్ ఏర్పాటు చేసేక్రమంలో ట్రాఫిక్ మళ్లింపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అదనపు కమిషనర్‌ను కోరారు. అయితే ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం మెట్రో లైన్ ఇరువైపుల 17 అడుగుల స్థలం ఉండాలన్నారు. పనులు పూర్తవ్వగానే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నాంపల్లి తాజ్ ఐస్‌క్రీమ్ జంక్షన్ వద్ద మెట్రో పిల్లర్ల నిర్మాణాల్లో మార్పులు చేయాలని సూచించారు. పుతిలీబౌలి జంక్షన్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల కోసం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పార్కింగ్ ఏరియాను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ఈనెల చివరి నాటికి అసెంబ్లీ వద్ద మెట్రో పిల్లర్లను పూర్తి చేయాలన్నారు. లక్డీకపూల్ మెట్రో స్టేషన్ వద్ద నిర్మాణాలు పూర్తయ్యాక సామగ్రిని తొలగించాలని ఎండీ ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎల్‌అండ్‌టీ ఎంపీ నాయుడు, మెట్రో సీఈ ఎండీ జీయావుద్దీన్, సీఈ మున్నాకుమార్, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి